‘‘గుంట్రు గుంట్రు గుంట్రు గుంట్రు గుంటూర్’’ బొగ్గు బస్సుకి బ్లోయరు కొడ్తూ అరుస్తున్నాడు క్లీనర్.

అది ఆరు గంటలకి అమరావతి నుంచి గుంటూరు వెళ్ళవలసిన ఫస్టు బస్సు. పాసింజర్లు ఆ క్లీనరు కేక అందుకుని ‘‘వచ్చె ... వచ్చె’’ అంటూ ఉత్తరీయాలు వూపుకుంటూ బస్సువైపు పరుగెత్తుతున్నారు.

ఇంజన్ వేడెక్కింది. క్లీనరు బ్లోయర్ కొట్టడం ఆపేశాడు కాని ‘‘గుంట్రు గుంట్రు గుంట్రు గుంటూర్’’ అని అరవడం ఆపలేదు. కండక్టరు ఇడ్లీ, కాఫీ ముగించుకుని కిళ్ళీ నములుతూ బస్సు దగ్గర కొచ్చాడు.

బస్సులోకెక్కిన జనం వైపు తక్కువ జాతి వాళ్ళను చూస్తున్నట్టు ఒక చిత్రమైన చూపు విసిరాడు. కిళ్ళీ ఆ బుగ్గ నుంచి ఈ బుగ్గకి మార్చి ‘‘ఎవరివయ్యా ఈ బస్తాలు? ఇది బస్సా, ఎడ్లబండా’’ అని హూంకరించాడు. జనం బిక్కు బిక్కుమన్నారు.

సుబ్బయ్య, ‘‘నావేనండి ఆ బస్తాలు’’ అని జాలిగా అన్నాడు.

‘‘రూపాయిన్నరవుద్ది లగేజి.’’

‘‘మొన్న ముప్పావలాయే తీసుకున్నారు గదండీ.’’

కండక్టర్‌కి వాదనంటే గొప్ప చిరాకు. ‘‘ఒరేయ్ కిట్టిగా’’ అని క్లీనర్‌ని పిలిచి ‘‘ఈ బస్తాల్ని, సుబ్బయ్య

## అమరావతి కథలు
### సత్యం శంకరమంచి

గారినీ కిందకు లాగెయ్యరా’’ అన్నాడు.

సుబ్బయ్య డీలా పడిపోయి ‘‘అట్లాగే కానివ్వండి కండక్టర్‌గారూ’’ అన్నాడు.


‘‘ఎవరా ఫ్రంట్ సీట్లో? ఫస్టు ట్రిప్పు ఓనరు గారొస్తారని తెలీదూ?’’ అనేసరికి ఫ్రంట్ సీట్లో సరదాపడి కూర్చున్న కుర్రాడు పరుగు పరుగున బాక్ సీట్లోకి వెళ్ళిపోయాడు.

‘‘గుంటూరెందరో చేతులెత్తండి’’ అని కండక్టర్ హుకుం జారీ చేసేసరికి గుంటూరు ప్యాసింజర్లందరూ చేతులెత్తారు.

‘‘సరిగ్గా చేతులెత్తండయ్యా-అన్నం తినిరాలా?’’ అని దబాయిస్తూ అన్ని ఊళ్ళకి ప్యాసింజర్లని లెక్క వేసుకుని డబ్బు వసూలు చేశాడు కండక్టరు. బస్సు కిటకిటలాడింది.

ఊపిరాడడం లేదు. డ్రైవరు ఇంకా రాలేదు. జనం ఉక్కతో మగ్గిపోతున్నారు. ఎట్టకేలకు డ్రైవరు బీడీ కాల్చుకుంటూ తాపీగా వచ్చి నీళ్ళు పెట్టలేదనీ, అద్దం తుడవలేదనీ క్లీనరుగాడిని బూతులు తిట్టి బస్సు స్టార్టు చేశాడు.

బస్సు గుంటూరు రోడ్డెక్కడానికి బదులు బస్సు ఓనర్ రామకృష్ణయ్య ఇంటివైపుకు బయల్దేరింది. రామకృష్ణయ్య ఇంటిముందు బస్సు ఆపి డ్రైవరూ, కండక్టరూ, క్లీనరూ ఓనరుగారింట్లోకి వెళ్ళారు.



ముద్దులల్లుడు

ఎంతసేపటికీ ఓనరు ఊడిపడ్డే? ఓనరు భార్య కండక్టర్‌ని పొట్లకాయలు తెమ్మని పంపించింది. డ్రైవరుకీ, క్లీనరుకీ అటకమీంచి కట్టెపుల్లలు తీసే పని అప్పగించింది.

రామకృష్ణయ్య ఇంకా స్నానం చేస్తూనే వున్నాడు. బస్సులో జనం కుతకుత ఉడికిపోతున్నారు. సుబ్బయ్యకి సెనగ బేరం అర్జెంటు. సిద్ధాంతికి ఆలస్యమైతే ముహూర్తం మించిపోతుంది. సేరయ్య కోర్టు వేళకి చేరుకోవాలి. ఎందరికి ఎన్ని అర్జంటు పనులున్నా బస్సు ఓనర్‌గారి వీలునుబట్టే బయల్దేరుతుంది.

ఓ అరగంట అయ్యాక రామకృష్ణయ్య బట్టలేసుకుని బస్సు దగ్గరికి వచ్చాడు. వెనకనే బస్సు పరివారమున్నూ. బస్సులోకి ఎక్కబోతూ తిరిగి ఇంట్లోకెళ్ళి భార్యతో ఏదో మాట్లాడాడు. ఈమారు బస్సెక్కబోతుంటే భార్యే కబురు పెట్టింది.

మరో పది నిమిషాలు ఆలస్యం. ఎట్టకేలకు ఓనరుగారు సీట్లో కూచోగా కండక్టర్ ‘‘రైట్’’ అన్న కేక జనానికి గొప్ప హాయిగా వుంది. పదడుగులు నడిచిందో లేదో ఫ్రంటు సీట్లో వున్న ఓనర్ ‘హోల్డాన్’ అన్నాడు. బస్సు ఆగిపోయింది.

‘‘ఇవాళ దావా వుంది. కరణంగారిని ఎక్కించుకు రావాలని తెలీదుట్రా తప్పుడు ముండాకొడకల్లారా?’’ అని డ్రైవరువైపు చూస్తూ అన్నాడు. డ్రైవరు సరాసరి బస్సును కరణంగారింటివైపుకు పోనిచ్చాడు. అప్పటికి కరణంగారు ఇంకా సంధ్యావందనం ముగించుకోలేదు. అక్కడ మరో అరగంట ఆలస్యం. జనం బస్సులో కూర్చోలేకపోతున్నారు. దిగితే మళ్ళీ ఎక్కనివ్వరేమోనని భయం. వెనక కూర్చున్న సీతమ్మకి కళ్ళు తిరుగుతున్నాయి. సీతమ్మ నిండు చూలాలు. ఆడబిడ్డ నోము నోచుకుంటానంటే తప్పక బయల్దేరింది. పక్కనున్న ముసలమ్మ సీతమ్మ అవస్థ చూసి మరచెంబు విప్పి మంచినీళ్ళిచ్చింది. మరో అరగంటకి బస్సు బయల్దేరింది.

ఆలస్యం అయినకొద్దీ అర్జంట్ పనులున్న అందరు ప్రయాణీకులూ కంగారుపడిపోతున్నారు. బస్సు నరుకుళ్ళపాడు దాటింది. ఎండ్రాయి దాటింది. బస్సు కుదుపుకి సీతమ్మ తట్టుకోలేకపోతోంది. లేమల్లె అల్లంత దూరాన వుందనగా సీతమ్మకి విపరీతమైన నొప్పులొచ్చాయి. ఆపుకోలేక పెద్దగా అరిచింది. గ్రహించిన అమ్మలక్కలు బస్సు ఆపించారు. జనమంతా బస్సు దిగారు. చుట్టుపక్కల ఊరు లేదు. ఆడకూతురికి అర్థాంతరంగా నొప్పులొచ్చినాయి. ఏం జేతుమంటే ఏం జేతుమని కంగారుపడ్డారు. ఇంతలో ఎవరో ‘‘చెరువు గట్టున చెట్టునారగా తెరకట్టండయ్యా’’ అన్నారు. పెట్టెలు తీసి చీరలు, పంచెలతో చెరువు గట్టున అడ్డం కట్టారు. ఎండ పడకుండా ఓ దుప్పటి పైన బిగించారు.

కొందరు మగాళ్ళు పరుగు పరుగున పొలాల్లోకి వెళ్ళి మెత్తటి చొప్పకట్టల్ని తీసుకువచ్చి పక్కలా పేర్చారు. ఆడవాళ్ళు సీతమ్మను మెల్లిగా చొప్పకట్టల మీద పడుకోపెట్టారు.

సీతమ్మకు నొప్పులు మరీ ఎక్కువైనాయి. హృదయవిదారకంగా ఏడుస్తోంది. దూరానున్న మగవాళ్ళకి గుండెలవిసిపోతున్నాయి. ఇప్పుడు వాళ్ళ మనసులో సెనగ బేరం, ముహూర్తం, అందుకోవలసిన రైలు, కోర్టు దావా అనేమీ లేవు. ఒకే ఒక్క దిగులు - ఈ ఆడకూతురి కష్టం ఎట్టా గట్టెక్కుతుందా అని. అందరి గుండెలూ భారంగా వున్నాయి. సీతమ్మ ఏడుపులూ, కేకలూ ఎవ్వర్నీ నుంచో నివ్వడం లేదు, కూర్చోనివ్వడం లేదు. ఇంతలో చెరువుగట్టు వైపు నుంచి కెవ్వుమని పసిపిల్లాడి ఏడుపు వినిపించింది. అందరి ముఖాలూ విచ్చుకున్నాయి. కొందరు ఎగిరి గంతేశారు. ఇంతలో ఓ ముసలమ్మ తెరల్లోంచి బయటకు వచ్చి ‘‘మొగపిల్లాడు’’ అని కేకపెట్టింది. కొందరు పరుగు పరుగున పొలాల్లో కాపలాకాస్తున్నవాళ్ళ దగ్గరకెళ్ళి, బాన తీసుకొచ్చి రాళ్ళతో పొయ్యి చేసి, నీళ్ళు కాచారు. ఓనరు రామకృష్ణయ్య బొడ్డు కోయడానికి తన మొలనున్న చాకు స్వయంగా తీసికెళ్ళి ఇచ్చాడు. సిద్ధాంతి అప్పటికప్పుడే జాతకచక్రం వేశాడు.

పిల్లాడికి స్నానం చేయించిన తర్వాత బస్సులోని జనమంతా వాణ్ని ముద్దాడారు, ‘‘సెరువు గట్టున పుట్టాడు సెంద్రిగాడు’’ అన్నారు. వాడికి ఆ పేరే ఖాయమైంది.

సెంద్రిగాడు అయ్య ఇంటా పుట్టలేదు, అమ్మ ఇంటా పుట్టలేదు. కాని, ఊరంతా వాడికి నావలే. మళ్ళీ బస్సు బయలుదేరింది. అయితే ఇప్పుడు ఊరి పేరు చెప్పగానే చెయ్యెత్తలేని మరో ప్రయాణీకుడున్నాడు.

ప్రతిస్పందన

‘‘ఇది ఇల్లా? వల్లకాడా?’’ కోపంగా అన్నాడు తండ్రి గొడవ చేస్తున్న తన పిల్లల్నుద్దేశించి.

‘‘మీరు తండ్రా? కాటికాపరా?’’ కొంటెగా అడిగాడో పిల్లాడు.

—పద్మశ్రీ, మాణిక్యారం